సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 5 । ఆగస్టు । 2024



మోగేను కల్యాణ వీణ

8లో


పెళ్లిళ్ల సీజన్ వచ్చింది.. మూడు నెలల విరామం తర్వాత మళ్లీ కల తెచ్చింది.. ఈ నెల 7 నుంచి ముహూర్తాలు ఉండడంతో మళ్లీ పలు వ్యాపారాలు పుంజుకోనున్నాయి.



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కందుకూరి సూర్యతేజ దంపతులు (ఆత్రేయపురం మండలం రాజవరం) ఆదివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

కడలిలోకి 5.83 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం రాత్రి 5,83,757 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పన విడుదల చేశారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 37.40 అడుగులకు పెరగడంతో సోమవారం ధవళేశ్వరం వద్ద మిగులు జలాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కోటసత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ తల్లి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,85,733 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు.

అయినవిల్లి.. భక్తులతో శోభిల్లి



స్వామివారి ఆలయంలో నిత్య గణపతి హోమం చేస్తున్న భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరా నమోస్తుతే నామస్మరణతో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం మార్మోగింది. ఆదివారం సెలవు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయమే ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో వివిధ పూజలు చేశారు. స్వామికి మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 44 మంది, లక్ష్మీగణపతి హోమంలో ఐదుగురు, నూతన వాహన పూజలను 11 మంది, తులాభారాన్ని ఇద్దరు చిన్నారులకు ఇచ్చారు. అన్నదాన పథకంలో 1,411 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,52,761 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

వెండి జల్లెడ, కలశం సమర్పణ



దాత శ్రీనివాస్, కళ్యాణి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారికి విశాఖపట్నానికి చెందిన అద్దేపల్లి శ్రీనివాస్, కళ్యాణి దంపతులు వెండి జల్లెడ, కలశాన్ని ఆదివారం సమర్పించారు. రూ.70 వేలతో తయారు చేసిన వీటిని ఆలయ సిబ్బందికి అందజేశారు. అలాగే స్వామివారి అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.10,116 విరాళం ఇచ్చారు. దాత శ్రీనివాస్ కుటుంబ సభ్యులను వేద పండితులు సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి

అమలాపురం టౌన్: జిల్లాలో సంభవించిన వరదల్లో వేలాది కుటుంబాలు, రైతులు నష్టపోయినా వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో కె.దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేలు కూడా అందించలేదని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు ఆరు నెలల పాటు నెలకు రూ.10 వేల చొప్పున భృతి కల్పించాలని, పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.50,000 నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్ర మాల్యాద్రి, బి.బలరామ్, కె.కృష్ణవేణి, జిల్లా పార్టీ కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పీతల రామచంద్రరావు, టి.నాగవరలక్ష్మి, సఖిలే సూర్యనారాయణ, పాలమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చదువులు తడబడి

- ప్రభుత్వ పాఠశాలలపై కూటమి సర్కారు చిన్నచూపు
- చాలీచాలని టీచర్లు
- సర్దుబాటు, ఖాళీల భర్తీపై కానరాని శ్రద్ధ
- సబ్జెక్టు టీచర్ల లేక విద్యార్థులకు ఇబ్బందులు



పెరవలి మండలం కాపవరం ప్రాథమిక పాఠశాలలో అన్ని తరగతులూ నిర్వహిస్తున్న టీచర్



చాగల్లు మండలం ఊనగట్ల జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, రాజమహేంద్రవరం: నేటి బాలలే రేపటి పౌరులు. వారే భావి భారత భాగ్య విధాతలు. అటువంటి చిన్నారులను సమున్నతంగా తీర్చిదిద్దేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి చదువేనని త్రికరణ శుద్ధిగా నమ్మిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో, విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకుని వచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేలా వినూత్న విధానాలు అవలంబించారు. పాఠశాల భవనాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. పేద పిల్లలు కూడా అందరితో సమానంగా తలెత్తుకుని ముందుకు కదిలేలా జగనన్న విద్యా కానుక అందించేవారు. ఇంకా ద్విభాషా పాఠ్య పుస్తకాలు, ట్యాబులు, స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) వంటివి అందుబాటులోకి తెచ్చారు. పేద, మధ్య తరగతి పిల్లలకు మేలు చేసే ఇటువంటి విధానాలను ఏ ప్రభుత్వమైనా కొనసాగించాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. సర్కారీ పాఠశాలలపై చిన్నచూపు చూస్తున్నట్టుగా కనిపిస్తోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తిరిగి 'పచ్చ'నీడలు క్రమంగా కమ్ముకుంటున్నాయి.

పాఠం చెప్పే వారేరి బాబూ?

ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత ప్రమాణాలతో కూడిన చదువును అందించే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సబ్జెక్ట్ టీచర్లతో బోధనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొన్ని ప్రాథమిక పాఠశాలలను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. తద్వారా వివిధ పాఠశాలల్లో అదనంగా ఉన్న సబ్జెక్ట్ టీచర్లను అవసరం ఉన్న ఇతర పాఠశాలల్లో డిప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఇదంతా వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరవడానికి ముందే చేపట్టేవారు. అయితే ఈసారి విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు 45 రోజులవుతున్నా.. సబ్జెక్ట్ టీచర్లు అందుబాటులో ఉన్నా.. సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం అంతు లేని జాప్యం చూపుతోంది. మరోవైపు ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై సైతం కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. పైగా గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా చేపట్టిన బదిలీలను అడ్డుకునేందుకు సైతం శ్రీకారం చుడుతోంది. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెనక్కు పంపే ప్రక్రియకు సిద్ధపడుతోంది. ఇప్పటికే జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 200 పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటువంటి కారణాలతో తగినంత మంది టీచర్లు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం గగనంగా మారింది.

ఈ నెలలోనే ఎఫ్‌ఏ–1 పరీక్ష

రాష్ట్ర ప్రభుత్వం అకడమిక్ షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకూ ఫార్మేటివ్ అసెస్మెంట్–1 (ఎఫ్‌ఏ–1) పరీక్ష నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్ష రాయాలి. ఈ పరీక్షల మార్కులు సంవత్సరం చివరిలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో కలుపుతారు. దీంతో ఈ పరీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎఫ్‌ఏ–1 పరీక్షకు సిలబస్ ప్రకారం ఒక్కో సబ్జెక్టుకు రెండు నుంచి మూడు పాఠాలు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం టీచర్ల సర్దుబాటు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు అధికంగా ఉండి, ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. దీనిపై ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సకాలంలో అందని కానుక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే విద్యా కానుక కిట్లు సకాలంలో అందించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బడి ప్రారంభమైనా అవసరమైన మేరకు పుస్తకాలు అందలేదు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు ఏటా స్కూల్ బ్యాగ్, యూనిఫాం, బెల్ట్, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, డిక్షనరీ వంటి వాటితో ప్రత్యేక కిట్ అందించేవారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,07,650 మంది విద్యార్థులకు రూ.30.50 కోట్ల విలువైన వస్తువులు అందజేసేవారు. ఈ ఏడాది పాఠశాలలు తెరచిన చాలా రోజులకు కానీ విద్యా కానుక కిట్లు అందజేయలేదు. దీనికి స్కూల్ కిట్‌గా పేరు మార్చారు. గత ప్రభుత్వం సిద్ధం చేసిన విద్యా కానుక కిట్ల పంపిణీలో సైతం కూటమి ప్రభుత్వం ఆపసోపాలు పడిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

రుచి తగ్గిన భోజనం

విద్యార్థులకు మంచి ఆహారం అందించాలన్న సదుద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించింది. ఏటా మెనూలో మార్పులు తీసుకువచ్చి మరీ బలవర్ధక ఆహారం అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు రాగిజావ సైతం అందించేవారు. జిల్లా వ్యాప్తంగా 1,011 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. దీని ద్వారా దాదాపు 1.26 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఈ పథకంలో మార్పులు తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో మధ్యాహ్న భోజనం కాస్త రుచి తగ్గుతోందని అంటున్నారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు

ప్రాథమిక	711
ప్రాథమికోన్నత	72
ఉన్నత	183
హైస్కూల్ ప్లస్	19
ప్రైవేటు	587
కేంద్ర ప్రభుత్వ పాఠశాల	1
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు	1,07,650
ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు	1,52,000

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



గత ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, అభివృద్ధి చేసింది. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా విద్యా రంగంపై దృష్టి సారించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి.

– తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఏకోపాధ్యాయులతో ఇబ్బందులు



ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఒక్కో పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలి. ప్రస్తుతం చాలా పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. ఇది విద్యార్థులకు ఇబ్బందికరం. ప్రభుత్వం స్పందించి అవసరమైన పాఠశాలల్లో ఉపాధ్యాయులను వెంటనే నియమించాలి.

– కె. ప్రసాదబాబు, గోపాలపురం

శ్రావణం.. శుభకరం



- నేటి నుంచి శ్రావణ మాసం
- మొదలు కానున్న శుభకార్యాలు
- నేడు సత్యదేవుని ఆవిర్భావ వేడుకలకు శ్రీకారం
- మరెన్నో ఆధ్యాత్మిక క్రతువులు
- రత్నగిరిపై సందడే సందడి

అన్నవరం: శుభకార్యాలకు దివ్యమైనదిగా చెప్పే శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. దీంతో భక్తవరదుడైన సత్యదేవుడు వెలసిన రత్నగిరిపై సందడి మొదలైంది. వైశాఖ మాసంలో అంటే మే నెలలో సత్యదేవుని వార్షిక కల్యాణ మహోత్సవాల తరువాత జూన్, జూలై నెలలు అంటే జ్యేష్ఠం, ఆషాఢ మాసాల్లో రత్నగిరిపై పెద్దగా స్వామివారి ఉత్సవాలు, వేడుకలేవీ జరగవు. దీనికి తోడు ఈ ఏడాది వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో వరుసగా మూఢం వచ్చింది. అనంతరం ఆషాఢం కావడంతో వరుసగా మూడు నెలల పాటు శుభకార్యాలకు సెలవు ఇచ్చారు. శ్రావణ మాసం వస్తూండటంతో మళ్లీ వివిధ శుభ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవంతో పాటు అనేక శుభకార్యాలకు ఈ మాసం నెలవు కానుంది.

నేటి నుంచి స్వామివారి ఆవిర్భావ వేడుకలు

సత్యదేవుని 134వ ఆవిర్భావ దినోత్సవం (సత్య విదియ) సోమవారం ఘనంగా ప్రారంభం కానుంది. దీనికి రత్నగిరిపై ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఉదయం 9 గంటలకు సత్య విదియ వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. అనివేటి మండపంలో సోమవారం సాయంత్రం ఆయుష్య హోమానికి అంకురార్పణ చేస్తారు. స్వామివారి జన్మ నక్షత్రం మఖ, స్వామివారి 134వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో సత్యదేవుడు, అమ్మవారిని అలంకరించి, ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో రథంపై సత్యదేవుని ఊరేగింపు, 11 గంటలకు ఆయుష్య హోమం పూర్ణాహుతి నిర్వహిస్తారు. అనంతరం వేద, స్మార్త, ఆగమ శాస్త్ర పండితులను ఘనంగా సత్కరిస్తారు. ఈ సందర్భంగా కదంబ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయనున్నారు. అదే రోజు రాత్రి ఏడు గంటలకు గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను అన్నవరం గ్రామంలో ఊరేగిస్తారు.

రేపు వజ్ర కిరీటాలంకరణ

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి పెద్దాపురానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతులు వజ్ర కిరీటం తయారు చేయించిన విషయం తెలిసిందే. కేజీ బంగారం, వజ్రాలతో రూ.2 కోట్ల వ్యయంతో ఈ కిరీటాన్ని తయారు చేయించారు. సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ కిరీటాన్ని సమర్పించనున్నారు. దీనిని అమ్మవారికి మంగళవారం అలంకరిస్తారు. దీంతో పాటు దాత దంపతులు స్వామి, అమ్మవార్లకు తయారు చేయించిన వజ్రాల కర్ణాభరణాలను కూడా అలంకరిస్తారు.

ధ్వజస్తంభానికి 9న బంగారు తాపడం

కాగా, నెల్లూరుకు చెందిన దాతలు రూ.3 కోట్ల వ్యయంతో బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న ధ్వజస్తంభానికి బంగారు రేకు తాపడం చేయనున్నారు. దీనికి ఈ నెల ఏడో తేదీ నుంచి ఏర్పాట్లు చేయనున్నారు.

7 నుంచి వివాహాలు

మూడు నెలల విరామం అనంతరం ఈ నెల ఏడో తేదీ నుంచి రత్నగిరిపై వివాహాది శుభకార్యాలు మొదలు కానున్నాయి. ఈ నెల 7, 8, 9, 15, 18, 22, 23 తేదీల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. దీనికోసం పెళ్లిబృందాలు ఇప్పటికే రత్నగిరిపై పలు వివాహ మండపాలు, సత్రం గదులు రిజర్వ్ చేసుకున్నాయి. సత్యగిరిపై ఎంఎస్ రెడ్డి అంజనీ ఉచిత వివాహ వేదిక, శ్రీ సత్య శ్రీనివాసా ఉచిత ఏసీ కల్యాణ మండపాల్లోని 24 కల్యాణ వేదికల్లో కూడా ఉచితంగా వివాహాలు జరగనున్నాయి. ఇక్కడ వివాహాలు చేసుకునే పెళ్లిబృందాలకు వివాహ సామగ్రి, పెళ్లిపీటలు కూడా దాతలే సమకూర్చుతున్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం



కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉద్యాన పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్‌పాం 2023–24 కింద జిల్లాలో కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన రైతులకు పూర్తి రాయితీతో మొక్కలు అందించామన్నారు. మూడు వేల హెక్టార్లలో సాగుకు అవసరమైన ఎరువుల కోసం ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు ఇప్పటి వరకూ రూ.4.19 కోట్లు జమ చేశామన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం 2023–24 కింద మామిడి, జీడిమామిడి, టిష్యూ కల్చర్ అరటి, కోకో తదితర పంటలు సాగు చేస్తున్న రైతులకు రూ.28.6 లక్షల సబ్సిడీ విడుదలైందన్నారు. ఇందులో ఇప్పటి వరకూ రైతుల ఖాతాలకు రూ.18.87 లక్షలు జమ చేశామని తెలిపారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా జిల్లాలో 15 ఉద్యాన పంటల సేకరణ కేంద్రాల నిర్మాణానికి సంబంధించి ఒక్కో సెంటర్‌కు రూ.5.25 లక్షల చొప్పున రూ.78.75 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. మిగిలిన రైతులకు మరో విడతలో రాయితీ అందిస్తామని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.

క్వారీ.. సారీ..

- స్తంభించిన అభివృద్ధి
- సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న క్వారీ పరిశ్రమ
- మూత పడుతున్న క్రషర్లు
- ఉపాధి లేక అల్లాడుతున్న కార్మికులు
- కరెంట్ బిల్లులు కూడా కట్టలేని స్థితిలో యజమానులు



దేవరపల్లి మండలం దుద్దుకూరులో భారీ వర్షాలకు నీటితో నిండిన క్వారీ



ముడిసరుకు లేక మూత పడిన స్టోన్ క్రషర్



రవాణా లేక నిలిచిపోయిన క్వారీ లారీలు

దేవరపల్లి: నల్లరాతి క్వారీ పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. గత ఆరు నెలలుగా క్వారీలు, క్రషర్లు మూత పడటంతో ఉపాధి లేక కార్మికులు అల్లాడిపోతున్నారు. జిల్లాలోని దేవరపల్లి మండలం గౌరీపట్నం పరిసరాల్లోని దుద్దుకూరు, కొండగూడెం, లక్ష్మీపురం, బందపురం; కొవ్వూరు మండలం దేచర్ల, ఐ.పంగిడి గ్రామాల్లో క్వారీలు, స్టోన్ క్రషర్లు విస్తరించి ఉన్నాయి. దాదాపు 40 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. క్వారీలకు అనుబంధంగా స్టోన్ క్రషర్లు ఏర్పాటు చేసుకుని, వివిధ సైజుల్లో మెటల్ తయారు చేసి, పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో తయారైన మెటల్‌కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంచి గుర్తింపు ఉంది. నాణ్యతతో కూడిన నల్లరాతి గనులు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ తయారైన మెటల్‌ను జాతీయ రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లోని సిమెంటు, తారు రోడ్లు, భవనాలు, రైల్వే లైన్ల నిర్మాణానికి ఎక్కువగా వినియోగిస్తారు. మెటల్ రవాణా, క్వారీ తవ్వకాల ద్వారా సెస్ రూపంలో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. ఈ నిధులను ఇక్కడి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం మైనింగ్ సెస్ రూపంలో విడుదల చేస్తోంది. మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిన మెటల్ వ్యాపారం ప్రస్తుతం నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతోంది.

కుదేలైందిలా..

గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులను ప్రభుత్వం ప్రారంభించకపోగా, గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులకు సైతం మోకాలడ్డుతోంది. ముఖ్యంగా సిమెంటు రోడ్లు, కాలనీల నిర్మాణ పనులు ఆగిపోవడంతో మెటల్ వ్యాపారం పూర్తిగా స్తంభించింది. వ్యాపారాలు లేక పలువురు యజమానులు క్వారీలు, క్రషర్లు మూసివేస్తున్నారు. గౌరీపట్నం ప్రాంతంలో 140 క్రషర్లు ఉండగా, 40 క్రషర్లకు విద్యుత్ సర్వీసులు తొలగించారు. మరో 40 పని చేయడం లేదు. మిగిలిన 60 క్రషర్లలో 20 అక్కడక్కడ పని చేస్తున్నాయి. అలాగే, ఈ ప్రాంతంలో 60 క్వారీలు ఉండగా, 20 కూడా నడవడం లేదని యజమానులు తెలిపారు. ప్రస్తుత వర్షాలకు 40 క్వారీలు వర్షపు నీటితో నిండిపోయాయి. క్వారీలను నడపలేని పరిస్థితుల్లో క్రషర్లకు కరెంట్ బిల్లులు, కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితిని ఎదుర్కొంటున్నామని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ వెంటిలేటర్‌పై ఉందని, కోలుకోవడం కష్టమని వాపోతున్నారు.

5 వేల కుటుంబాలకు ఉపాధి

దాదాపు 40 ఏళ్లుగా వేలాదిగా కార్మికులు క్వారీలు, క్రషర్ల వద్ద పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పదేళ్ల క్రితం దాదాపు 12 వేల మంది కార్మికులు క్వారీ పరిశ్రమల్లోని వివిధ విభాగాల్లో పని చేసేవారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో క్వారీలు, క్రషర్లలో ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. దీనివలన కార్మికుల అవసరం తగ్గింది. ప్రస్తుతం సుమారు 5 వేల మంది ఈ పరిశ్రమలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, కాలనీల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కోడ్ ముగిసిన తర్వాత కూడా ప్రస్తుత ప్రభుత్వం ఇంత వరకూ అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయలేదు. దీని ప్రభావం క్వారీ పరిశ్రమపై పడింది. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు దాదాపు 20 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు క్వారీ గోతులు నీటితో నిండిపోయాయి. ఇది కూడా క్వారీల్లో పనులు నిలిచిపోవడానికి కారణమైంది. ఫలితంగా తమకు పనులు లేకుండా పోయాయని కార్మికులు వాపోతున్నారు. మెటల్ రవాణా లేకపోవడంతో క్వారీ లారీలు కూడా ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ లారీలపై సుమారు 1,200 మంది కార్మికులు పని చేస్తున్నారు.

ప్రభుత్వంపై నమ్మకం లేదు



కాంట్రాక్టర్ల బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లిస్తుందనే నమ్మకం లేదు. రాష్ట్రం మళ్లీ పట్టాలెక్కాలంటే రెండేళ్లు పడుతుంది. అప్పటి వరకూ అభివృద్ధి పనులు చేయడం కష్టం. కనీసం రహదారులకు ప్యాచ్ వర్కులు కూడా చేయలేరు. క్వారీ పరిశ్రమ కుప్పకూలిపోయింది. కరెంటు బిల్లులు కట్టే పరిస్థితి కూడా లేదు. కార్మికులకు పనులు చెప్పలేని దుస్థితి ఏర్పడింది.

– గౌరీబాబు, జిల్లా క్వారీ క్రషర్ల యజమానుల అసోసియేషన్ ప్రతినిధి, గౌరీపట్నం

ఉపాధి పోయింది



భారీ వర్షాల ప్రభావం క్వారీ పరిశ్రమపై పడింది. వర్షపు నీటితో క్వారీలు నిండిపోవడంతో పనులు జరగడంలేదు. సుమారు రెండు నెలలుగా పనులు లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. స్టోన్ క్రషర్లు, క్వారీలు, క్వారీ లారీలపై పని చేస్తూ సుమారు ఐదారు వేల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. కార్మికులకు ప్రభుత్వమే ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

– షేక్ మస్తాన్, అధ్యక్షుడు, రాష్ట్ర ప్రగతిశీల కార్మిక సంఘం

క్లుప్తంగా

భవనం పైనుంచి దూకి విద్యార్థిని మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం రూరల్ కాతేరు రామాలయం వద్ద సుంకర హారిక (15) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందింది. మూడో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన సుంకర సత్తిబాబు చిన్న కుమార్తె హారిక. ఆమె కాతేరులోని ఓ కళాశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం హారిక యథావిధిగా స్కూల్‌కు వెళ్లింది. సాయంత్రం అయినా తమ కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు స్కూల్‌కు ఫోన్ చేశారు. హారిక స్కూల్ వదలగానే వెళ్లిపోయిందని వారు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు హారిక కోసం వెతికారు. రాత్రి 7 గంటల సమయంలో తమ కుమార్తె కాతేరు రామాలయం సెంటర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ వద్ద రక్తపుమడుగులో ఉందని సమాచారం వచ్చింది. దీంతో వారు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని రక్తపుమడుగులో ఉన్న తమ కుమార్తెను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల హారిక సెల్‌ఫోన్ అతిగా వాడడంతో తండ్రి సత్తిబాబు మందలించడంతో మనస్తాపానికి గురై భవనం పైనుంచి దూకినట్లు చెబుతున్నారు. తండ్రి సత్తిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు బాలిక

సామర్లకోట: విశాఖపట్నంలో అదృశ్యమైన బాలికను సామర్లకోట రైల్వే స్టేషన్‌లో గుర్తించినట్లు రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదివారం రైల్వే ప్లాట్‌ఫామ్‌ను తనిఖీ చేస్తున్న మహిళా కానిస్టేబుల్ ఓ బాలికను గుర్తించింది. ఆమె వివరాలు అడగ్గా తాను విశాఖపట్నం నుంచి సామర్లకోట వచ్చినట్లు చెప్పింది. ఐడీ కార్డు ఆధారంగా విశాఖపట్నంలోని ఓ స్కూల్‌లో ఆమె 8వ తరగతి చదువుతున్నట్లు గుర్తించారు. ఆమె తల్లిదండ్రుల ఫోన్ నంబర్ తీసుకుని సమాచారం ఇచ్చారు. అప్పటికే విశాఖపట్నం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో శనివారం బాలిక అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. ఇక్కడకు కుటుంబ సభ్యులు రాగా, ఆ బాలికను అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

మోగేను కల్యాణ వీణ



- మూడు నెలల తర్వాత మోగనున్న పెళ్లి బాజా
- నేటి నుంచి శ్రావణ మాసం
- ఈ నెల అంతా పూజలు.. పండగలే
- 7 నుంచి వివాహ ముహూర్తాలు



కాంతులీనుతున్న కల్యాణ మండపం (ఫైల్)

రాయవరం: పెళ్లి.. జీవితంలో ఓ మధురానుభూతి. అందుకే అందరూ మెచ్చేలా అత్యంత వైభవంగా జరుపుకోవాలని భావిస్తుంటారు.. కాస్త ఆలస్యమైనా అన్నీ సవ్యంగా కుదిరాకే పెళ్లిళ్లు చేసుకుంటారు. మూడు నెలల విరామం తర్వాత ముహూర్తాలు ఉండడంతో మళ్లీ కల్యాణ బాజా మోగనుంది. మూఢం కారణంగా నిలిచిపోయిన పెళ్లిళ్లు, శ్రావణ శుద్ధ తదియతో మళ్లీ జరగనున్నాయి. ఇప్పటికే శుభ ముహూర్తాలు నిర్ణయించుకున్న పెళ్లి బృందాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఎక్కడ చూసినా కల్యాణ మండపాలు ముందుగా బుక్ అయ్యాయి. ఈ నెల 7వ తేదీ నుంచి వరుస ముహూర్తాలు ఉండడంతో చాలా మంది వివాహాలు, గృహ ప్రవేశాలు, నిర్మాణ ముహూర్తాలు చేసుకున్నారు. సోమవారం నుంచి శ్రావణ సందడి ప్రారంభం కానుంది.

శ్రావణం.. శుభప్రదం

శ్రావణం మాసం శుభప్రదం. ఈ రోజుల్లో ప్రతి గడియా లక్ష్మీకటాక్షమే. ప్రతి తిథి దివ్య ముహూర్తమే. ఏ కార్యం మొదలు పెట్టినా శుభకరమే. నెలంతా ఆధ్యాత్మికంగానే భక్తులు భావిస్తారు. అందుకే శ్రావణ మాసానికి అంతటి ప్రాముఖ్యం ఉంది. ఈ మాసంలో మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రంగా చూస్తారు. శ్రావణ సోమవారం శివునికి, మంగళవారం మంగళ గౌరికి, శుక్రవారం లక్ష్మీ ప్రసన్నం కోసం లక్ష్మీదేవికి, శనివారం వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తారు. కోనసీమ జిల్లాలో ద్రాక్షారామ, కోటిపల్లి, ర్యాలి, వాడపల్లి, అంతర్వేది ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి.

పూజలు.. పండగలు

శ్రావణ మాసంలో పర్వదినాలు అధికంగా ఉన్నాయి. ఈ నెల 8న చతుర్థి వ్రతం, 9న నాగ పంచమి, 16న వరలక్ష్మీవ్రతం, 19న రాఖీ పౌర్ణమి, 27న కృష్ణాష్టమి ఉన్నాయి. ఈ నెల 5, 12, 19. 26, సెప్టెంబర్ 2 తేదీలు శ్రావణ సోమవారాలు, 9, 16, 23, 30 తేదీల్లో శ్రావణ శుక్రవారాలు, అలాగే 10, 17, 24, 31 తేదీలు శ్రావణ శనివారాలు ఉన్నాయి. ఈ రోజుల్లో పూజలు, ప్రత్యేక కార్యక్రమాలతో భక్తులు బిజీగా గడపనున్నారు.

మళ్లీ మంచి రోజులు

ఏప్రిల్ 27 నుంచి మొదలైన శుక్ర మౌఢ్యమి జూలై 6న ఆషాఢ శుద్ధ పాడ్యమి వరకూ ఉంది. ఇది ఉండగానే మే 5వ తేదీ నుంచి గురు మౌఢ్యమి మొదలైంది. మూడు నెలలు శుభ కార్యక్రమాలు లేక వాటిపైనే ఆధారపడిన వివిధ వృత్తిదారులు, వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. మండపాలు ముస్తాబు చేసేవారు మొదలుకుని పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, ఈవెంట్ల నిర్వాహకులు, వస్త్ర దుకాణాలు, పూలు, పండ్ల వ్యాపారాలు, ప్రింటింగ్ ప్రెస్, నగల దుకాణాలు, క్యాటరింగ్ వంటి వారికి గట్టిదెబ్బ తగిలింది. శ్రావణంతో తిరిగి శోభ రానుంది.

సరికొత్త పోకడలు

గతంలో వివాహ వేడుకలు అంటే బ్యాండ్ మేళాలు, భాజాభజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా కామన్‌గా ఉండేవి. ఇప్పుడు పూర్తిగా ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రీ వెడ్డింగ్ షూట్ల కోసం ఇతర లొకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులచే స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి అవి ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కల్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై ప్రదర్శించడం ఇలా విభిన్నంగా వేడుకను నిర్వహిస్తున్నారు.

ముహూర్తాలు ఇలా..

శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభమవుతున్నా.. ఈ నెల 7 నుంచి వివాహ ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణ మాసం సెప్టెంబరు 3తో ముగియనుంది. కానీ అమావాస్య ముందు ఈ నెల 31 వరకే శుభకార్యాలకు అనువుగా ఉంటుందని పండితులు చెబుతున్నారు. ఈ నెల 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్ 3 నుంచి శూన్యమాసం కారణంగా అక్టోబర్ 2వ తేదీ వరకు శుభ ముహూర్తాలు ఉండవు. తిరిగి ఆశ్వీయుజ మాసం అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 26 వరకూ ముహూర్తాలు ఉన్నాయి. డిసెంబర్ 31 నుంచి 2025 జనవరి 29 వరకూ పుష్య మాసం (శూన్యమాసం) కావడంతో శుభ ముహూర్తాలు లేవు.

ఉపాధి లభిస్తుంది



మూడు నెలల పాటు ముహూర్తాలు లేక ఖాళీగా ఉన్నాం. శ్రావణమాసం ప్రారంభం కావడంతో శుభ కార్యాలు అధికంగా ఉంటాయి. ఈ మాసంలో ప్రతి రోజూ ఫొటోగ్రాఫర్లకు చేతి నిండా పని దొరుకుతుంది. తద్వారా ప్రతి ఒక్కరికీ ఉపాధి ఉంటుంది.

–సలాది శివాజీ, ఫొటోగ్రాఫర్, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

సీజన్ ప్రారంభం



మూడు నెలలుగా మౌఢ్యం కారణంగా శుభ ఘడియలు, పెళ్లి ముహూర్తాలు లేవు. శ్రావణ మాసంలో ఈ నెల 7వ తేదీ రాత్రి నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. శుభ కార్యాలకు మూడు నెలల విరామం ఉండడంతో ఈసారి అధిక మొత్తంలో పెళ్లిళ్లు జరుగనున్నాయి.

– విలపర్తి ఫణిధర్ శర్మ, పురోహితుడు, రాయవరం

బాబు శ్వాస నిలపండి..

- నెల రోజులుగా ఆసుపత్రిలో చికిత్స
- దాతల కోసం ఎదురుచూపులు



చికిత్స పొందుతున్న నెల రోజుల బాబు

అల్లవరం: చిన్నప్రాయానికి పెద్ద కష్టం వచ్చింది.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైంది. ఉన్నదంతా ఖర్చు చేసిన ఆ కుటుంబం దాతల సాయం కోరుతోంది. అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు కొడప ప్రాంతానికి చెందిన పెయ్యల నాగమణి నెల రోజుల కిందట అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఓ మగ బిడ్డకు జన్మనిచ్చింది. మగబిడ్డ పుట్టాడన్న సంతోషం ఎంతో సేపు నిలువలేదు. పుట్టిన బాబు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని వైద్యులు గుర్తించి అమలాపురంలోని కోనసీమ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స అందించాలని సిఫార్సు చేశారు. పిల్లల వైద్యుడు శ్రీమన్నారాయణ బాబుని పరీక్షించి ఊపిరితిత్తుల వాల్స్ తెరుచుకోకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడని గుర్తించి వెంటిలేటర్ ద్వారా నెల రోజులుగా చికిత్స అందిస్తున్నారు. బాబు ఆరోగ్యం మెరుగుపడాలంటే హైదరాబాద్, లేదా విజయవాడకు పంపించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు తెలిపారు. దీంతో నెల రోజులుగా ఆ బాబుని కాపాడుకునేందుకు ఆ తల్లిదండ్రులు దాతల సహాయాన్ని కోరుతున్నారు. ఇప్పటి వరకూ రూ.4 లక్షల వరకూ ఖర్చు చేశామని, ఇక ఖర్చు చేసేందుకు తమ వద్ద ఏమీ లేవని బాబు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆరోగ్యశ్రీలో చికిత్స చేయడానికి అవకాశం లేదని, దాతలు సాయం చేసి బాబును కాపాడాలని నాగమణి కోరుతోంది.

వృద్ధుడి మృతి

నిడదవోలు రూరల్: పురుగు మందు తాగిన వృద్ధుడు మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ ఆదివారం తెలిపారు. తాడిమళ్లకు చెందిన గుంజే సోమరాజు (78) ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఆదివారం అతను పురుగు మందు తాగగా, కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ సోమరాజు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతని కుమారుడు రామకృష్ణ ఇచ్చారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

తీర ప్రాంతాలకు నిధులు ఖర్చు చేయండి

- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్



రిలయన్స్ టెర్మినల్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

తాళ్లరేవు: తీర ప్రాంతంలోని చమురు సంస్థలు తమ లాభాల్లో 50 శాతం నిధులను ఈ ప్రాంత అభివృద్ధికి ఖర్చు చేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఆదివారం గాడిమొగ రిలయన్స్ టెర్మినల్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. రిలయన్స్, ఓఎన్జీసీ వంటి చమురు సంస్థలు ఈ ప్రాంతంలోని కేజీ బేసిన్ నుంచి ఆయిల్‌ను యథేచ్ఛగా తరలించుకుపోతున్నాయని ఆయన అన్నారు. ఈ ప్రాంతానికి, ప్రజలకు గాని ఒక్క రూపాయి కూడా సహాయం చేయడం లేదని సూర్యనారాయణరావు ఆరోపించారు. ఎక్కడైతే గ్యాస్ ఉత్పత్తి జరుగుతుందో ఆ ప్రాంతానికి ఆర్థిక సంఘం నిధులు 50 శాతం ఖర్చు పెట్టాలని ఉన్నా, ఆయా సంస్థలు ఖాతరు చేయడం లేదన్నారు. జార్ఖండ్, అస్సాం, నాగాలాండ్‌లలో ఉద్యమాలు చేయడం వల్ల ఆ ప్రాంతంలో 50 శాతం నిధులు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఇరవై ఏళ్లలో సుమారు రూ.50 లక్షల కోట్ల సంపదను, ఇక్కడి నుంచి ఆయా కంపెనీలు తీసుకువెళ్లాయన్నారు. లెక్క ప్రకారం రూ.25 లక్షల కోట్ల లాభాలను ఆంధ్రప్రదేశ్‌కు ఖర్చు పెట్టాల్సి ఉందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలకు గానూ, వైజాగ్ స్టీలు ప్లాంట్‌కు గాని కోనసీమ రైతాంగానికి పింఛన్లు ఇవ్వడానికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ధీరూబాయి అంబాని క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌ను ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఓఎన్జీసీ ద్వారా వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మించాలని కోరారు.

బాధితులను ఆదుకోవాలి

కేరళ రాష్ట్రంలో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది మృతి చెందారని ఎమ్మెల్సీ అన్నారు. వయనాడ్‌లో జరిగిన ఘోర ప్రమాద బాధితులకు సహాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యానాం కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లాడి సత్తిబాబు మాట్లాడుతూ గత 22 ఏళ్లుగా రిలయన్స్ ఈ ప్రాంతంలో లావాదేవీలు చేస్తుందని, ప్రతి ఇంటికి గ్యాస్ కనెక్షన్ ఇస్తానని చెప్పి మాట తప్పిందన్నారు. చమురు సంస్థలపై ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న సూర్యనారాయణ రావుకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, లీగల్ సెల్ నాయకుడు కుడుపూడి త్రినాథ్, బీసీ నాయకులు కడలి రాంపండు, యనమదల కరుణాకుమార్, పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో అవకతవకల గుర్తింపు

సాక్షి ఇంపాక్ట్



మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ అధికారి లక్ష్మణస్వామి

కొవ్వూరు: కొవ్వూరు పెట్రోల్ బంక్‌ల ఎదురుగా ఖాళీ స్థలంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న సిబ్బంది శుక్రవారం రాత్రి దుకాణం మూసివేసి మద్యం బాటిళ్లను బయటకు తరలించారు. దీనిపై 'రాత్రయితే చేతివాటమే' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఆదివారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ అధికారి) వైవీవీ లక్ష్మణస్వామి, హెచ్‌సీ (రిటైల్ అవుట్‌లెట్ వెరిఫికేషన్ ఆఫీసర్) ఆర్.ఆంబ్రూస్‌లు విచారణ చేశారు. తొమ్మిది రకాల మద్యం బ్రాండ్‌లకు గాను 79 బాటిళ్లు తక్కువగా ఉన్నట్లు విచారణలో తేలిందని లక్ష్మణస్వామి తెలిపారు. దీనిపై సిబ్బందిని సంజాయిషీ కోరగా స్కాన్ అవ్వని కారణంగా వాటిని స్కానింగ్ చేయకుండానే విక్రయించినట్లు చెప్పారు. ఏదైనా మద్యం బాటిల్ స్కాన్ కాకుంటే ఉన్నతాధికారులకు నివేదించి వారి నుంచి నిర్దేశిత లేబుళ్లను తీసుకుని వాటిని అతికించి స్కానింగ్ చేయాలని లక్ష్మణస్వామి అన్నారు. దీనిలో సేల్స్ సూపర్‌వైజర్ కె.సత్తిపండు, సేల్స్‌మెన్లు బి.రాహుల్, ఎస్.స్వామిలు నిర్లక్ష్యంగా వ్యవహించినట్లు గుర్తించామన్నారు. ఈ ముగ్గురిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే మద్యం తరలింపు వీడియోలో రికార్డు అయిన వ్యక్తి ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరో మద్యం దుకాణంలో పనిచేస్తున్న చినబాబుగా గుర్తించామన్నారు. సదరు దుకాణంలో నచ్చిన బీరు బ్రాండు లేక ఇక్కడి నుంచి మూడు బీరు బాటిళ్లను కొనుగోలు చేసి చినబాబు తీసుకెళ్లినట్లు విచారణాధికారులు చెప్పుకొచ్చారు. మద్యం తీసుకెళ్లిన చినబాబు కూడా ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇవ్వాల్సి ఉందని లక్ష్మణస్వామి స్పష్టం చేశారు.

చోరీ ముఠా గుట్టురట్టు

- 11 మంది నిందితుల అరెస్ట్
- రెండు ఆటోలు, రూ.2.40 లక్షల స్వాధీనం



కొవ్వూరులో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు

కొవ్వూరు: పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి కాపర్ వైర్ల చోరీకి పాల్పడుతున్న ముఠాను కొవ్వూరు రూరల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఆదివారం స్థానిక రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కొవ్వూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసుల్లో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, నల్లజర్లలో మూడు, కొవ్వూరు పట్టణంలో రెండు కేసుల్లో మూడు, చాగల్లు, గోపాలపురం, తాళ్లపూడి స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున, **రాజానగరంలో రెండు, అన్నవరంలో రెండు కేసుల్లో** నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి, వాటిలో కాపర్ వైర్లను ఈ ముఠా చోరీ చేసింది. ఇందులో ప్రధాన నిందితుడు కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన సారిక సురేష్. ఇతను అప్పుడప్పుడూ తాపీపని నిమిత్తం హైదరాబాద్ వెళ్లేవాడు. అక్కడ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడికి చెందిన పల్లా లోవరాజు, వేములూరుకు చెందిన తంపర సురేష్, సారిక దుర్గారావు, మంగిన అజిత్‌కుమార్‌లతో పాటు దొరయ్యచెరువు ప్రాంతానికి చెందిన మట్టా శివ, మల్లిచెట్టు డోలానంద్‌లలో ఒకేచోట తాపీ పని చేస్తుండేవాడు. ప్రధాన నిందితుడు సురేష్‌కు ఎలక్ట్రీషన్ పని కూడా రావడంతో పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను **పగులకొట్టి రాగి వైర్లు చోరీ చేయవచ్చని మిగతా ఏడు**గురికి చెప్పారు. దీంతో ఆ ఎనిమిది మందితో పాటు పారుపాక గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడితో వివిధ ప్రాంతాల్లో 22 ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి కాపర్ వైర్లను చోరీ చేశారు. ఈ మేరకు తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో 18 కేసుల్లో వీరి నిందితులు. రాత్రిపూట ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైర్లు చోరీచేసి లోవరాజుకి చెందిన వ్యాన్‌లో తరలించేవారు. అనంతరం పాత ఇనుప సామాన్లు విక్రయించే వ్యాపారులు సీతంపేటకు చెందిన నరమామిడి సత్యనారాయణ, పెరవలి మండలం కాపవరానికి చెందిన చింతలపూడి సత్యనారాయణ, రాజమహేంద్రవరంలో లాలాచెరువు హౌసింగ్‌బోర్డు ప్రాంతానికి చెందిన పన్నెరు నందికేశవరావు, కిర్లంపూడికి సరిసిక కృష్ణకు చెందిన పాత సామాన్ల దుకాణాల్లో విక్రయించే వారు. ఆదివారం చిడిపి గ్రామంలో వారంతా కలసి ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్లు చోరీకి వెళుతుండగా ఎస్సైలు కె.జగన్‌మోహరావు, రూరల్ ఎస్సై కె.సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం నిందితులు **ఏడుగురితో పాటు సామాన్లు కొంటున్న నలుగురిని** పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రెండు ఆటోలు, రూ.2.40 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో కాకినాడ జిల్లా పారుపాక గ్రామానికి **చెందిన బాలుడు** పరారీలో ఉన్నట్లు వివరించారు.

వ్యర్థాల శుద్ధి.. నిత్య విధి

- రోజుకు 59 లక్షల లీటర్ల ఓఎన్జీసీ ఆయిల్ వ్యర్థాల శుద్ధి
- కేజీ బేసిన్‌లో నాలుగు ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు
- నిత్యం రూ.1.18 కోట్లు వెచ్చిస్తున్న సంస్థ



కోనసీమ జిల్లా గోపవరంలో ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్



ప్లాంట్‌లో శుద్ధి చేసిన వ్యర్థ జలాలను తిరిగి డ్రై వెల్స్‌లోకి పంపే ఇంజక్షన్ పైప్‌లైన్ యూనిట్

మలికిపురం: కేజీ బేసిన్ పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో ఆయిల్, విష పదార్థాలతో కూడిన వ్యర్థాల శుద్ధికి ఓఎన్జీసీ తీవ్రంగా శ్రమిస్తోంది. ఆయిల్ ఉత్పత్తి పడిపోయి నీటి శాతం అధికంగా వస్తున్న నేపథ్యంలో వ్యర్థాల నిర్వహణ ఆ సంస్థకు భారం అవుతోంది. సుమారు 500కు పైబడి ఆయిల్, గ్యాస్ బావులున్న కేజీ బేసిన్‌లో రోజుకు 5,900 క్యూబిక్ లీటర్ల (59 లక్షల లీటర్ల) ఆయిల్ వ్యర్థాల శుద్ధి జరుగుతోంది. దీనికోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గోపవరం జీసీఎస్, కేశనపల్లి స్ట్రక్చర్ పరిధిలోని గొల్లపాలెం జీసీఎస్, తాటిపాక జీసీఎస్, కృష్ణా జిల్లా లింగాల జీసీఎస్‌లలో నాలుగు ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. వీటిని సుమారు రూ.220 కోట్లతో నిర్మించి ఓ సంస్థకు కాంట్రాక్టును ఓఎన్జీసీ ఇచ్చింది.

కేజీ బేసిన్‌లో ఆయిల్, గ్యాస్ నిక్షేపాల వెలికితీత కార్యకలాపాలు దాదాపు 1970 నుంచి ప్రారంభించినప్పటికీ ఆయిల్‌తో పాటు వెలికివస్తున్న వ్యర్థాలను ఎక్కడికక్కడ భూభాగంపై వదిలి వేయడంతో నానాటికీ కాలుష్య కారకాలు పేరుకుపోతున్నాయి. కేజీ బేసిన్‌లోని సుమారు 28 గ్యాస్ కలెక్షన్ స్టేషన్ల (జీసీఎస్)లో ఆయిల్, గ్యాస్ బావులు ఉన్నాయి. ఆయా బావుల ద్వారా పైకి వచ్చే క్రూడాయిల్‌ను జీసీఎస్‌ల్లోని భారీ ట్యాంకుల్లో నిల్వ ఉంచి క్రూడాయిల్, వ్యర్థాలతో కూడిన నీటిని వేరు చేస్తారు. పదేళ్ల కిందటి వరకూ ఇలా వేరు చేసిన వ్యర్థ జలాలను చమురు సంస్థలు ఎక్కడికక్కడ విడిచి పెట్టేవి. ఒక్కో ఆయిల్ జీసీఎస్ నుంచి రోజుకు సుమారు 25 వేల నుంచి 30 వేల లీటర్ల వ్యర్థ జలాలు విడుదల అవుతున్నట్లు అంచనా. క్రూడాయిల్‌లో లిగ్రాయిన్స్, పెట్రోల్ ఈథర్, కిరోసిన్, హైడ్రోకార్బన్ వాయువులు, పెట్రోల్, గ్యాస్ తదితర ఇంధనాలు మాత్రమే ఉంటాయి. ఇవి యంత్రాలు నడిచేందుకు, ఇతర రసాయన అవసరాలకు తప్ప మొక్కలు, జంతువులు పెరిగేందుకు ఏమాత్రం ఉపయోగపడవు. అంతే కాకుండా వాటికి అపకారం చేస్తాయని రసాయన శాస్త్ర నిపుణులు చెబుతున్నారు.

అప్పట్లో వదిలేసి.. ఇప్పుడు శుద్ధి చేసి

క్రూడాయిల్ నుంచి వేరు చేసిన జలాల్లో సుమారు 20 శాతం ఆయిల్ వ్యర్థాలు ఉంటాయి. ఇవి కూడా వడగట్టాలంటే చమురు సంస్థలకు అధిక ఖర్చుతో కూడుకున్న పని. దీంతో పదేళ్ల కిందటి వరకూ దాని జోలికి వెళ్లకుండా వ్యర్థాలతో కూడిన జలాలను ఆయా బావుల సమీపంలోనే వదిలేసేవారు. రసాయన శాస్త్ర నిపుణులు చెబుతున్న వివరాల మేరకు ఈ వ్యర్థాలు పడిన ప్రాంతంలో వాణిజ్య పంటలు, చెట్ల పెరుగుదల అంతగా ఉండదు. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అలాగే ఈ వ్యర్థాల నీరు ప్రవహించే నదులు, డ్రైన్లు, సముద్రాలు, చెరువుల్లో మత్స్య సంపద చనిపోతుంది. పునరుత్పత్తిపై కూడా ప్రభావం పడి మత్స్య సంపద తరిగిపోతుంది. పర్యావరణ ప్రేమికులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఓఎన్జీసీ వ్యర్థాల నీటి శుద్ధి చేయడం ప్రారంభించింది.

తిరిగి డ్రై వెల్స్‌లోకి..

ప్రస్తుతం కేజీ బేసిన్‌లో శుద్ధి చేసిన వ్యర్థ జలాల నుంచి 20 శాతం తిరిగి ఆయిల్ వస్తుంది. దీనిని నేరుగా స్థానిక జీసీఎస్‌లకే పంపుతారు. 70 శాతం శుద్ధి చేసిన జలాలు వస్తాయి. ఈ నీటిని ఆయా జీసీఎస్‌ల పరిధిలో డ్రై వెల్స్ (ఒట్టిపోయిన బావులు) లోనికి జీసీఎస్‌కు ఆయిల్ వచ్చిన పైప్ నుంచే ఇంజక్షన్ పైప్‌లైన్ ద్వారా నేరుగా నింపుతారు. డ్రై వెల్స్ నిండిపోతే సముద్రతీరాలు ఉన్నచోట నేరుగా పైప్‌లైన్లు వేసి సముద్రంలోకి పంపిస్తున్నారు. పది శాతం స్లడ్జ్ వస్తుంది. ఇది కేక్ మాదిరిగా ప్లాంట్ల వద్దనే ఉంటుంది. దీనిని కొవ్వొత్తుల తయారీ, ఇతర రసాయన పరిశ్రమల్లో వినియోగిస్తారు. ఈ స్లడ్జ్ కేక్‌లను ఆయా కంపెనీలు నేరుగా ఓఎన్జీసీ నుంచి కొనుగోలు చేసుకుంటాయి.

ప్లాంట్ల నిర్వహణ ఇలా..

ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణకు ఓఎన్జీసీ రోజుకు రూ.1.18 కోట్లు ఖర్చు చేస్తుంది. ప్లాంట్‌లను రూ.220 కోట్లతో ఓఎన్జీసీయే ఏర్పాటు చేసినా వాటి నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. సుమారు పదేళ్ల కిందట వీటిని ఏర్పాటు చేసి కాంట్రాక్టును మెగా ఇంజినీరింగ్ సంస్థకు ఇచ్చింది. ఈ ఏడాది గత జూన్ నెల 17వ తేదీతో ఆ సంస్థతో ఒప్పందం ముగిసింది. నిర్మాణ రంగంలో బిజీగా ఉన్న మెగా ఇంజినీరింగ్ సంస్థ ఈసారి దీనికి టెండర్ వేయలేదు. దీంతో సింగిల్ టెండర్ వేసిన చెన్నైకు చెందిన హెచ్‌సీఎస్ సంస్థ దక్కించుకుంది. నాలుగేళ్ల నిర్వహణ బాధ్యతను అప్పగిస్తారు. ఈ ప్లాంట్ 24 గంటలూ పని చేస్తుంది. లీటరు వ్యర్థ జలాన్ని శుద్ధి చేసినందుకు ఓఎన్జీసీ రూ.2 చెల్లిస్తుంది. ఇలా ప్రస్తుతం కేజీ బేసిన్‌లో రోజుకు 59 లక్షల వ్యర్థ జలాలను ఓఎన్జీసీ శుద్ధి చేయిస్తోంది.